అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -9 గురువారం 4 జూన్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# 21 మంది మృతి

# ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం

40 మందికి గాయాలు మృతుల్లో అత్యధికులు విదేశీయులే

సహాయక చర్యల్లో జాప్యంతో భారీ ప్రాణనష్టం

భద్రతా ప్రమాణాలు పాటించని భవన యాజమాన్యం - రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి





**న్యూఢిల్లీ,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)**
దేశ రాజధానిలో బుధవారం ఉదయం ఒక హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విషాద ఘటనలో 21 మంది నిండు ప్రాణాలు బుగ్గి అయ్యాయి. మరో 40 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. సాకేత్‌లోని మాక్స్ ఆస్పత్రికి 39 మంది తరలించగా..అప్పటికే వారిలో 18 మంది చనిపోయారు. మిగిలినవారికి చికిత్స అందిస్తున్నామని,**మిగతా 2లో...**



# రేపటి నుంచి కొత్త రేట్లు!

భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల మార్కెట్ విలువ సవరణ

పెరగనున్న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు

శాస్త్రీయ పద్ధతిలో విలువలు సవరించినట్టు తెలిపిన మంత్రి పొంగులేటి

**,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణలో భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లు మరింత భారం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలను జూన్ 5వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రకటించారు. వాస్తవ మార్కెట్ పరిస్థితులకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు,**2లో...**

# ఉత్తర తెలంగాణకు కేంద్రం వరం

## రెండు జాతీయ రహదారుల విస్తరణకు ఆమోదం

190 కిలోమీటర్లు, రూ.7,597 కోట్ల వ్యయం రెండేళ్లలో పూర్తి

జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు ప్రయోజనం

ఒకటి హామ్ పద్ధతిలో.. రెండోది కాంట్రాక్టు పద్ధతిలో నిర్మాణం

నాలుగులేన్ల ప్రామాణిక మార్గంగా అభివృద్ధి ఆర్మూర్

మంచిర్యాల, జగిత్యాలకరీంనగర్ మధ్య తగ్గనున్న ప్రయాణ సమయం



**న్యూఢిల్లీ ,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త) :** కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సంబంధించి అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. రూ 7,597.16 కోట్ల వ్యయ అంచనాలతో మొత్తం 190 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల పనులకు ఆమోదం తెలిపారు. కేంద్ర మంత్రి మండలి బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశం అయింది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను తెలియచేశారు. కేంద్ర కేబినెట్ ద్వారా ఇంతకు ముందు , **2లో...**


# కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్

మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం

సిద్దరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు

కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి



**బెంగళూరు,,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)**
కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లోట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక పముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు.
**మిగతా 2లో...**

# ఆన్‌లైన్ బెట్టింగ్ కు రాజ్యాంగ రక్షణ లేదు

సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ




# కులదూషణలు దారుణం

అమరజీవి పొట్టి శ్రీరాములుకు కూడా తప్పని కులచట్రం

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన

**అమరావతి,,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)**
భాష ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను కూడా నేడు కుల చట్రాల్లో బంధించడానికి సగటు రాజకీయ ఆలోచనలు చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలో అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలన పక్కనబెడితే.. 1989 నుంచి రాజకీయాల్లో కుల దూషణలు విపరీతంగా పెరిగిపోయాయని మండిపడ్డారు. కొంతమంది స్వార్థపరులు**మిగతా 2లో...**



# భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్..

వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారుచేయించారని అమెరికా ఆరోపణ

అందుకుగానూ 12.5 శాతం పన్ను విధించాలని ప్రతిపాదన

ఇది ఇంకా ఖరారు కాలేదని కేంద్రం ప్రభుత్వం వివరణ

వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు సాగుతున్నట్లు వెల్లడి



# టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం

తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం

యువతలో నైపుణ్యాలను తీర్చి దిద్దాలన్న సిఎం రేవంత్



**హైదరాబాద్,,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు **మిగతా 2లో...**

# వచ్చే ఏడాది ఖచ్చితంగా పాదయాత్ర చేస్తా

కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేను

తెలంగాణ అప్పులపై చర్చకు సిద్దమే

మీట్ ద ప్రెస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)**
వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానమిచ్చారు. పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని చూస్తున్నానని చమత్కరించారు. వచ్చే ఏడాది పాదయాత్ర,**మిగతా 2లో...**

# ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం



**మొదటిపేజీ తరువాయి**

వీరిలో 8 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. సకాలంలో సహాయక చర్యలు చేపట్టడంలో జాప్యం చోటుచేసుకోవడం వల్లే భారీ స్థాయిలో ప్రాణ నష్టం జరిగిందన్న విమర్శలు వస్తున్నాయి. బిజెపి డబుల్ ఇంజిన్ సర్కార్ కు ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని కాంగ్రెస్, ఆమాద్మీ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధితుల్లో అత్యధికులు మధ్య ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందినవారు. ఈ విషాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటనకు సంబంధించి హోటల్ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో ఉదయం 8.50గంటల సమయంలో ఫ్లరిష్ స్టే బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఉదయం ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయడానికి ప్రయత్నించగానే మంటలు వచ్చాయని చెఫ్ కేసర్ సింగ్ తెలిపారు. వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేశానని, బయటకు వచ్చి చూసేసరికి ఒక్కసారిగా మంటలు హోటల్ అంతా వ్యాపించినట్లు కనిపించిందని తెలిపారు. మంటలు చెలరేగిన సమయంలో సీల్డ్ గాజు కిటికీలు, సెన్సార్‌తో పనిచేసే గేట్ల వల్ల సహాయక సిబ్బంది వెంటనే చర్యలు తీసుకోవడం కూడా ఇబ్బందిగా మారింది. దీనికి తోడు హోటల్‌లో పరిమితికి మించి జనాభా వున్నట్లు తెలుస్తోంది. కిక్కిరిసిన రూములు, పైగా అగ్ని ప్రమాదం జరిగినపుడు తీసుకోవాల్సిన భద్రతా ప్రమాణాలు కూడా హోటల్ యాజమాన్యం ఉల్లంఘించినట్లు తెలుస్తోంది. ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఈ భవనానికి లేదు. దీంతో మొత్తంగా హోటల్ ఒక మృత్యుకూపంగా మారింది. చాలా వేగంగా భవనాన్ని పొగ, మంటలు కమ్ముకోవడంతో డజన్ల సంఖ్యలో లోపలివారు తప్పించుకునే వీలు లేకపోయింది.

సమాచారం తెలిసిన వెంటనే స్థానికులు కిటికీలు బద్దలు కొట్టి, దుప్పట్లు కప్పి లోపల వున్నవారు బయటకు వచ్చేందుకు సాయపడ్డారు. ఐదంతస్తుల ఈ హోటల్ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద నడుస్తోంది. ఆ లైసెన్స్ ప్రకారం ఆరు గదులకు మాత్రమే అనుమతి వుంటుంది. కానీ భవనం బేస్‌మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్, పైన గల ఐదు అంతస్తుల్లో ఏకంగా 25 గదులు వున్నట్లు తెలుస్తోందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. పైన టెర్రస్ కూడా వుందని, అన్ని అంతస్తుల్లోనూ గదులు వున్నాయని, ఏదైనా ప్రమాదం జరిగితే బయటపడేందుకు కూడా వీల్లేని రీతిలో అత్యంత అధ్వాన్నంగా ఆ నిర్మాణం వుందని చెప్పారు. అయితే వెంటనే అగ్నిమాపక బృందాలు ఘటనా స్థలికి రావడంలో ఆలస్యమైందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆ హోటల్ భవనానికి ఎదురు భవనంలో వుండే అంజుమ్ అనే మహిళ మాట్లాడుతూ పొద్దునే తన తండ్రికి మందులు ఇవ్వడానికి ఆయన గదిలోకి వెళ్ళేసరికి ఏదో వాసన వచ్చిందని, ఆ వెంటనే ఒక స్పార్క్‌లా వచ్చిందని, భవనం మంటల్లో చిక్కుకుందని తెలిపారు. పెద్ద ఎత్తున పేలుళ్ళ శబ్దాలు కూడా వినిపించాయన్నారు. చాలామంది ప్రాణాలు కాపాడుకోవడానికి పైఅంతస్తుల నుండి కిందకు దూకేశారని తెలిపారు. వీరిలో మహిళలు కూడా వున్నారన్నారు. మృతదేహాలు గుర్తుపట్టడానికి వీల్లేకుండా వున్నాయి. ప్రతి ఒక్కరూ తీవ్రంగా కాలిపోయారని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ఢిల్లీ పోలీసులు కల్పబుల్‌హోమిసైడ్ అభియోగాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఈ సంఘటనపై దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసింది. ఈ భవనం ఎన్నేళ్ళ కాలం నాటిది, యజమాని ఎవరు అన్న వివరాలు కనుగొని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ స్థాయీ సంఘం చైర్మన్ సత్య శర్మ తెలిపారు.

# ఉత్తర తెలంగాణకు కేంద్రం వరం

**మొదటిపేజీ తరువాయి**

ఎప్పుడూ లేని రీతిలో ఇప్పుడు ఈ హై ప్రాజెక్టుల నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోదం దక్కింది. ఇప్పుడు ఆమోదించిన పనులలో రెండు రహదారులు ఏర్పాటు అవుతాయి. మొదటిది ఎన్‌హెచ్ 63పరిధిలోని ఆర్మూర్ జగిత్యాల మంచిర్యాల సెక్షన్ రాదారి విస్తరణ హైబ్రిడ్ అన్యూటి మాడల్ (హామ్) పద్ధతిలో నిర్మిస్తారు. ఇక రెండోది ఎన్‌హెచ్ 563 సంబంధిత జగిత్యాల కరీంనగర్ సెక్షన్ రహదారి బిల్డ్ ఆపరేటర్ ట్రాన్స్‌ఫర్ ప్రాతిదికన కాంట్రాక్టుకు ఇస్తారు. నాలుగు లేన్ల ప్రామాణిక మార్గంగా దీనిని మారుస్తారు.తెలంగాణలో జాతీయ రాదార్ల విస్తరణ, నాలుగు లేన్ల రూపకల్పనకు సంబంధించి కేబినెట్ భేటీ తరువాత అధికారిక ప్రకటన వెలువరించారు. ఈ రాదార్ల ఏర్పాటు క్రమంలో మునుపటి ఉమ్మడి ఆదిలాబాద్ ,ఌశ్రీంశీ =ఘుఽ - ఫ్యూచర్ సిటీ బోగస్ కరీంనగర్ జిల్లా , కొంత మేరకు నిజామాబాద్ జిల్లాల ప్రజలకు మేలు జరుగుతుంది. ఇప్పుడు ప్రతిపాదించిన ఆర్మూర్, జగిత్యాల, మంచిర్యాల ప్రాజెక్టు సెక్షన్ నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల




జిల్లాల మీదుగా సాగుతుంది. ఇప్పుడు ఈ ప్రాంతంలో హై వే వెంబడి విస్తృత జనసంచారం, రద్దీ వ్యాపార సముదాయాలు ప్రాంతాలు ఉండటంతో ఇరుకైన దారిలో సాగాల్సి వస్తోంది ఈ మార్గంలో అంకుశాపూర్, కోరుట్ల, ధర్మపురి, లక్సెటిపేట, మంచిర్యాల, జగిత్యాల్ వంటి ప్రాంతాలు ఉండటంతో ప్రయాణ ఇక్కట్లు తలెత్తుతున్నాయి. ఇదే విధంగా జగిత్యాల కరీంనగర్ సెక్షన్ కూడా పలు రద్దీ ప్రాంతాల మీదుగా వెళ్లుతుంది. జగిత్యాల, పోతారం, గంగాధర , కరీంనగర్ లలో ఇటీవలి కాలంలో విపరీత స్థాయిలో ప్రయాణాలు సాగుతున్నాయి. ఈ డిమాండ్‌ను ఇప్పటి రోడ్లు సరైన విధంగా తీర్చలేకపోతున్నాయి. పూర్తి స్థాయి సమీక్షలు విశ్లేషణల తరువాత ఈ రెండు సెక్షన్ల విస్తరణ, నాలుగు లేన్ల పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు అధికారిక ప్రకటనలో తెలిపారు. ఈ మార్గంలో మహారాష్ట్ర , గుజరాత్ వంటి దూర ప్రాంతాలకు వేగంగా వెళ్లేందుకు వీలేర్పడుతుంది. మరిన్ని కనుగొనండి జిల్లా వార్తలు వార్తల వీడియోలు ఆన్‌లైన్ ప్రకటన సేవలు ఌశ్రీంశీ =ఘుఽ - ధాన్యం కొనకపోతే సిఎం ఇంటిముందు పారబోస్తాం ఌఽజవతీఅంవఎవత్ ప్రయాణ సమయం గంటన్నర దాకా కుదింపు ఈ ప్రాజెక్టులు రెండు సంపూర్తి అయితే ఈ ప్రాంతాల్లో వారికి రవాణా సమయం దాదాపుగా గంటన్నర వరకూ ఆదా అవుతుంది. ఆర్మూర్, మంచిర్యాల మధ్య వెళ్లే వారికి గంటన్నర కలిసి వస్తుంది. కాగా జగిత్యాల, కరీంనగర్ మధ్య వెళ్లే వారికి దాదాపు ముప్పావు గంట ప్రయాణ సమయం తగ్గుతుంది. ఎక్కువగా రవాణా సౌకర్యాలు ఏర్పడటంతో పాటు వ్యాపార రంగం వృద్ధికి వీలేర్పడుతుందని ఆశిస్తున్నారు.

# టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం

**మొదటిపేజీ తరువాయి**

చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమికండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ కు రాజ్యాంగ రక్షణ లేదు

## సుప్రీకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)** ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, శాంతి భద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ఎ÷-లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా... వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొంది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది.

# కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

**మొదటిపేజీ తరువాయి**

అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కులదూషణలు దారుణం

**మొదటిపేజీ తరువాయి**

ఈ కుల సంఘాలను అడ్డం పెట్టుకుని వ్యక్తిగతంగా బాగుపడుతున్నారనే అనుమానం ఉందన్నారు. ఏ కులం నాయకుడితో ఆ కులం వారినే తిట్టించే నీచ సంస్కృతి వల్ల యువత భావోద్వేగాలకు లోనవుతున్నారని ఆందోళన చెందారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మరీ దిగజారిందని, సమాజానికి అద్దం పట్టే జర్నలిస్టులను సైతం కులాల పేరుతో దూషించడం ప్రారంభించారని ధ్వజమెత్తారు. ఒక వ్యక్తి తప్పు చేస్తే, దానికి కులాలను ఆపాదిస్తూ సమాజంలో చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ ఎమ్మెల్సీ దళిత యువకుడిని హత్య చేసి, శవాన్ని ప్యాక్ చేసి డోర్ డెలివరీ చేసినా ఆ పార్టీ వెనుకేసుకొచ్చిందని ఆగ్రహం

వ్యక్తం చేశారు. డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి చంపేసినా ఆయా కుల సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా వైసీపీ తీరు మారలేదని, ఇలాంటి కుల రాజకీయాలకు చరమగీతం పాడాలని జనసేన గట్టిగా నిర్ణయించుకుందని స్పష్టం చేశారు. ఇటీవల కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో దీనిపై చర్చించామని.. ఎవరు ఎలా మాట్లాడినా తామంతా కలిసికట్టుగా స్పందిస్తామని పవన్ తెలిపారు. ఇకపై రాజకీయాల్లో జరిగే కుల దూషణలను, అరాచకాలను తిప్పికొట్టేందుకు జనసేన పక్షాన 'సేన గళం' పేరుతో ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు, ఇకపై ఎవరు దూషించినా 'సేన గళం' గట్టిగా స్పందిస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

# భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్..

**,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)** భారత వస్తువులపై అమెరికా మరోసారి అదనపు సుంకాలు విధించనుందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ విషయంపై అగ్రరాజ్యంతో నిరంతరం చర్చిస్తున్నామని, ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేసింది. కార్మికులతో వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారు చేయించారంటూ భారత్‌తో సహా 60 దేశాలపై సెక్షన్ 301 కింద అదనపు సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదించిన విషయం తెలిసిందే.దీనిపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పందిస్తూ అమెరికాతో వాణిజ్య ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు చర్చలు కొనసాగుతున్నాయని తెలిపింది. ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ప్రజాభిప్రాయ సేకరణ దశలోనే ఉందని పేర్కొంది. సంబంధిత వర్గాలు 2026 జూన్ 22లోపు తమ విజ్ఞప్తులను సమర్పించవచ్చని, జులై 7 తర్వాతే అమెరికా తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేసింది.

ఇప్పటికే సెక్షన్ 232 కింద ఉన్న కొన్ని ఉత్పత్తులకు ఈ కొత్త పన్నుల నుంచి మినహాయింపు లభించింది. అలాగే టెక్స్‌టైల్ రంగానికి అమెరికా ప్రత్యేక వెసులుబాటును ప్రతిపాదించింది. దీని ప్రకారం నిర్దేశిత పరిమాణంలోని దుస్తుల దిగుమతులపై తక్కువ పన్ను రేట్లు విధించే అవకాశం ఉంది. పరస్పర వాణిజ్య ఒప్పందాలు అంగీకరించే దేశాలకు ఈ పన్ను 10 శాతంగా ఉంటుంది. ప్రస్తుతానికి చర్చలు నడుస్తున్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత్ వెల్లడించింది.

# రేపటి నుంచి కొత్త రేట్లు!

**మొదటిపేజీ తరువాయి**

ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

ఈ సవరణ కోసం ప్రభుత్వం శాస్త్రీయమైన, పారదర్శకమైన విధానాన్ని అనుసరించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో క్షేత్రస్థాయి అధ్యయనాలు, రిజిస్ట్రేషన్ల డేటా విశ్లేషణ, నిపుణుల కమిటీల సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పారిశ్రామిక వృద్ధి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని డిమాండ్‌ను ఆధారంగా చేసుకుని కొత్త విలువలను నిర్ధారించారు.కొత్త విధానం ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లలోని అన్ని అంతస్తులకు ఒకే రకమైన విలువను వర్తింపజేయనున్నారు. ఇప్పటికే అధిక విలువలు ఉన్నచోట్ల ఎలాంటి పెంపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ సహా కీలక ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, నివాస ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస ధరలను నిర్ణయించారు.ఈ సవరణ ఫలితంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. ఇది ఆస్తి కొనుగోలుదారులపై, పెట్టుబడిదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, ప్రజలపై అనవసర భారం పడకుండా హేతుబద్ధంగానే ఈ మార్పులు చేశామని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయం పెరగడంతో పాటు లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# వచ్చే ఏడాది ఖచ్చితంగా పాదయాత్రచేస్తా

**మొదటిపేజీ తరువాయి**

ఎప్పుడు అనేది పార్టీ నిర్ణయిస్తుందని కేటీఆర్ తెలిపారు. 2027లో కచ్చితంగా పాదయాత్ర ఉంటుందని పునరుద్ఘాటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి, ఏ టైమ్‌లో పాదయాత్ర చేయాలనే దానిపై పార్టీలో పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కడుపులో కత్తులు పెట్టుకుని.. పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అందుకే తనకు అహంకారమని అంటారేమో అని తెలిపారు. మీకు అహంకారమని అంతా అనుకుంటారని ఇంటర్వ్యూల్లో చెప్పారు కదా.. దాని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ ఈ మేరకు స్పందించారు.

నాకు అహంకారమని అంతా ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని కొన్ని మ్యాన్యుఫ్యాక్చరింగ్ డిఫెక్ట్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని.. కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని నాకు మాట్లాడటం రాదని చెప్పారు. తెలంగాణ వాడిని కదా.. కడపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని



తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ.2.8 లక్షలు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో

కాంగ్రెస్ పార్టీ రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేడయంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నది కాకిలెక్కలు అని కేటీఆర్ అన్నారు. ఏడాది కాలంలో రూ.29వేల కోట్ల అప్పు మాత్రమే తీర్చారని తెలిపారు. నెలకు రూ.6వేల కోట్ల అప్పు తీరుస్తాన్నమనేది అబద్ధమని స్పష్టం చేశారు. రూ.2వేల కోట్లే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చలకు సిద్ధమని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా ముంచిందని, ధాన్యం కొనుగోళ్లలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్రస్థాయిలో విమర్శించారు. ధాన్యం కొనుగోళ్ల నుంచి రైతు డిస్కమ్ వరకు, ఫ్యూచర్ సిటీ నుంచి జర్నలిస్టుల ఇండ్ల స్థలాల వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడిన కేటీఆర్.. 60 రోజులు దాటినా రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ధాన్యంతో పడిగాపులు కాస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టూ లేదని విమర్శించారు. చివరి గింజ సంగతి దేవుడెరుగు, కనీసం తొలి గింజ కూడా కొనలేని పరిస్థితి రాష్ట్రంలో ఉందని ఎద్దేవా చేశారు. రైతులకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే కొనుగోళ్లను జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.

# మండుటెండలో చల్లని చలివేంద్రం

## కేయూ క్రాస్‌లో ఉచిత మజ్జిగ పంపిణీ





**హనుమకొండ, బ్యూరో జూన్ 3 (జర్నలిస్ట్ వార్త):** ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో దాహంతో అలమటిస్తున్న ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం మహిళ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (రూసా) ఆధ్వర్యంలో బుధవారం కేయూ క్రాస్ వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, బాటసారులు, చిరు వ్యాపారులు మజ్జిగను స్వీకరించి దాహం తీర్చుకున్నారు. కార్యక్రమాన్ని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె. భిక్షాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ, మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కళాశాల సిబ్బంది, విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యాసంస్థలు భాగస్వాములు కావడం సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ భిక్షాలు మాట్లాడుతూ, విద్యతో పాటు సామాజిక బాధ్యతను కూడా విద్యార్థుల్లో పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎండల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు తమ వంతు సహాయంగా మజ్జిగ పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వీరునాయక్, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కేయూ క్రాస్‌లో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం పలువురి ప్రశంసలు అందుకుంది.

# నీడనిచ్చే చెట్లనే కాల్చేస్తున్న దుండగులు!

## చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్




**తల్లాడ/, జూన్ 3 (జర్నలిస్ట్ వార్త):**
పచ్చదనానికి ప్రతీకగా నిలిచే చెట్లను కొందరు దుండగులు ఉద్దేశపూర్వకంగా కాల్చివేస్తుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తల్లాడ మండలంలోని ఓ ప్రాంతంలో భారీ చెట్టును కాల్చివేయడంతో అది మొండెంగా మారిపోయింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణలో చెట్టును నీడనిచ్చే అమ్మతో సమానంగా భావిస్తారని, అలాంటి చెట్లనే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం నాశనం చేయడం బాధాకరమని స్థానికులు అంటున్నారు. చెట్లు పర్యావరణ పరిరక్షణకు, జీవ వైవిధ్యానికి మూలాధారమని తెలిసినా వాటిని కాల్చివేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లను ధ్వంసం చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్న సమయంలో చెట్లను కాల్చివేయడం వంటి ఘటనలను ఉపేక్షించరాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# సైబర్ నేరగాళ్ల వలలో చిక్కొద్దు

## గుర్తుతెలియని లింకులు క్లిక్ చేస్తే ఖాతాలు ఖాళీ!




**తల్లాడ/, జూన్ 3 (జర్నలిస్ట్ వార్త):** సైబర్ నేరగాళ్ల బారిన పడి ఆర్థికంగా నష్టపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. తల్లాడ మండలంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు సైబర్ మోసగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులపై ప్రజలకు వివరించారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్, సందేశాలు, లింకులను నమ్మవద్దని, వాటిని క్లిక్ చేస్తే వ్యక్తిగత సమాచారం చోరీకి గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, ఓటీపీలు, పాస్‌వర్డులు వంటి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ఉద్యోగాలు, లాటరీలు, బహుమతులు, పెట్టుబడుల పేరుతో మోసగాళ్లు ప్రజలను వలలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి ప్రలోభాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద కాల్ లేదా సందేశం వచ్చిన వెంటనే పోలీసులను లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించి మోసాలను అరికట్టడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వరికొయ్యకాళ్లు కాల్చితే కేసులే..!

**స్టబుల్ బర్నింగ్‌పై కలెక్టర్ కఠిన ఆదేశాలు**

**ఉల్లంఘిస్తే జైలు శిక్ష, జరిమానా**

**రైతులకు తహసీల్దార్ సదానందం హెచ్చరిక**



తహసీల్దార్ సదానందం

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూన్ 3( జర్నలిస్ట్ వార్త):**
పంట కోతల అనంతరం మిగిలిపోయే వరికొయ్యకాళ్లు, పంట అవశేషాలను తగులబెట్టే రైతులపై కఠిన చర్యలు తప్పవని ధర్మసాగర్ తహసీల్దార్ సదానందం హెచ్చరించారు. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా స్టబుల్ బర్నింగ్‌ను నిషేధిస్తూ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ జారీ చేసిన ఉత్తర్వులను బుధవారం ఆయన వివరించారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్‌ఎస్)–2023లోని సెక్షన్ 163 ప్రకారం ఈ నిషేధాజ్ఞలు అమల్లోకి వచ్చాయని తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరికొయ్యకాళ్లను తగులబెట్టడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లడమే కాకుండా ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని అన్నారు. పొలాల్లో మంటలు పెట్టడం ద్వారా వెలువడే పొగ, విషవాయువులు వాయు కాలుష్యానికి కారణమవుతాయని, రహదారులపై దట్టమైన పొగమంచు ఏర్పడి ప్రమాదాలు సంభవించే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. మరోవైపు భూమిలోని సేంద్రియ పదార్థాలు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి భూసారం క్షీణిస్తుందని, తద్వారా భవిష్యత్తులో పంటల దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని, సేంద్రియ ఎరువులుగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం సూచిస్తున్న ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చన్నారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించి పంట అవశేషాలను తగులబెట్టిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)–2023లోని సెక్షన్ 223 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఇతరులకు ఇబ్బంది లేదా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే ఆరు నెలల వరకు జైలు శిక్ష లేదా జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. మానవ ప్రాణాలు, భద్రతకు ముప్పు కలిగించే పరిస్థితులు ఏర్పడితే ఏడాది వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చని హెచ్చరించారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, పోలీసు శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి మినహాయింపు లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సదానందం స్పష్టం చేశారు.

# మంచితనం ఓటమా... మాయమాటలే విజయమా?

ఒకప్పుడు సమాజంలో మనిషి విలువను అతని నిజాయితీ, నీతి, నిబద్ధతలతో కొలిచేవారు. నేడు పరిస్థితులు మారిపోయాయి. వ్యక్తిత్వం కంటే ప్రదర్శనకు, నిజం కంటే నటనకు, విలువల కంటే వంచనకు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తున్నదన్న భావన సమాజంలో బలపడుతోంది. అందుకే ఈ ప్రపంచంలో బ్రతకాలంటే నటించడం నేర్చుకోవాలి. లేకపోతే మాటలతో మాయ చేయడం రావాలి అనే వ్యాఖ్యలు తరచూ వినిపిస్తున్నాయి.

సాంకేతికంగా అభివృద్ధి చెందిన సమాజం మానవ విలువల విషయంలో మాత్రం వెనుకబడుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియా యుగంలో అసలు వ్యక్తిత్వం కంటే కృత్రిమ ఇమేజ్‌కే ఎక్కువ ఆదరణ లభిస్తోంది. మనసులో ఏమున్నా బయటకు మరొకలా కనిపించడం, స్వార్థ ప్రయోజనాల కోసం సంబంధాలను ఉపయోగించుకోవడం, మధురమైన మాటలతో నమ్మించి మోసం చేయడం వంటి ధోరణులు పెరుగుతున్నాయి. ఫలితంగా నిజాయితీగా జీవించే వారు అనేక సందర్భాల్లో నిరాశకు గురవుతున్నారు. నిజానికి మంచితనం బలహీనత కాదు.



నీతి, నిజాయితీ ఓటమికి సూచికలు కావు. అయితే వాటిని కాపాడుకుంటూనే పరిస్థితులను అర్థం చేసుకునే వివేకం కూడా అవసరం. అమాయకత్వాన్ని మంచితనంగా భావిస్తే నష్టపోయే అవకాశాలు ఉంటాయి. అందుకే విలువలను వదలకుండా, సమయస్ఫూర్తితో ముందుకు సాగే జీవన విధానం అవసరం. ఇప్పటి పోటీ ప్రపంచంలో తెలివితేటలు అవసరమే. కానీ ఆ తెలివి మోసానికి, నటనకు, ఇతరులను మభ్యపెట్టడానికి ఉపయోగపడితే అది సమాజానికి ప్రమాదకరం. వ్యక్తిగత విజయాల కోసం నైతిక విలువలను తాకట్టు పెట్టే ధోరణి పెరిగితే విశ్వాసం అనే బంధం క్రమంగా కనుమరుగైపోతుంది. కుటుంబాలు, స్నేహాలు, సామాజిక సంబంధాలు అన్నీ అనుమానాల నీడలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

తాత్కాలికంగా మాయమాటలు విజయాన్ని అందించవచ్చు. నటనతో అవకాశాలు దక్కవచ్చు. కానీ శాశ్వత గౌరవం, ప్రజల విశ్వాసం, చరిత్రలో స్థానం మాత్రం నిజాయితీ కలిగిన వారికే లభిస్తాయి. సమాజ నిర్మాణానికి అవసరమైనది మోసం కాదు. మానవత్వం. నటన కాదు. నిబద్ధత. మాయమాటలు కాదు. మనస్ఫూర్తి.

అందుకే నేటి తరానికి అవసరమైన సందేశం ఒక్కటే. ప్రపంచాన్ని అర్థం చేసుకోండి. పరిస్థితులను ఎదుర్కొనే తెలివిని పెంపొందించుకోండి. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ మీ విలువలను కోల్పోవద్దు. ఎందుకంటే కాలం ఎంత మారినా చివరికి గెలిచేది నిజమే. నిలిచేది మంచితనమే.



సీనియర్ జర్నలిస్ట్
బిర్రు కరుణాకర్

# పాముకాటుతో మహిళ మృతి

**గీసుగొండ/ జూన్ 3(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని ఊకల్ గ్రామంలో పాముకాటుకు గురై కట్ట సునిత (38) అనే మహిళ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన కట్ట దేవేందర్ భార్య సునిత ఈ నెల 30న ఉదయం ఇంట్లో పనులు చేసుకుంటూ రాత్రి వండిన అన్నం గిన్నెను బయట పెట్టడానికి వెళ్ళింది. ఆ సమయంలో అక్కడ ఉన్న ఇటుకల మధ్య పొంచి ఉన్న పాము ఆమెను కరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున 1:25 గంటల ప్రాంతంలో సునిత కన్నుమూసింది. మృతురాలి భర్త దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసుగొండ సీఐ డి.విశ్వేశ్వర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆకస్మిక తనిఖీలో డీసీపీ ధార కవిత

## పట్టుబడ్డ వాహనాలు బాధితులకు అప్పగించాలి

## పోలీస్ క్వార్టర్ల సమస్యలపై ఆరా



**ఎల్కతుర్తి, /జూన్ 3(జర్నలిస్ట్ వార్త):** స్థానిక పోలీస్ స్టేషన్‌ను సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించిన ఆమె, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోర్టు అనుమతులు పూర్తైన వాహనాలను వెంటనే బాధితులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బంది నివసిస్తున్న క్వార్టర్లను పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్లలో నివసిస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు చేరువగా ఉంటూనే నేరాల నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలని డీసీపీ సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, పరిపాలనా విధానాలను పరిశీలించిన డీసీపీ ధార కవిత సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో సీఐ పులి రమేష్, ఎస్ఐ నరసింహారావు తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బడి బాటే భవిష్యత్తుకు బంగారు బాట

సమాజ అభివృద్ధికి విద్యే మూలస్తంభం. వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాదు, కుటుంబం, గ్రామం, రాష్ట్రం, దేశం భవిష్యత్తును సైతం విద్యే నిర్దేశిస్తుంది. అందుకే "తల్లిదండ్రులు తమ పిల్లలను బడి వరకు నడిపిస్తే.. మిగిలిన జీవితమంతా విద్య వారిని నడిపిస్తుంది" అనే సందేశం ప్రతి ఇంటిలో ప్రతిధ్వనించాల్సిన అవసరం ఉంది.నేటి ప్రపంచంలో విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం చదివే సాధనం కాదు. అది వ్యక్తిత్వ వికాసానికి, ఆలోచనా శక్తికి, సామాజిక చైతన్యానికి పునాది. విద్య లేని జీవితం దిశలేని ప్రయాణం వంటిది. చదువు మనిషికి జ్ఞానాన్ని మాత్రమే కాదు, ఆత్మవిశ్వాసాన్ని, నిర్ణయ సామర్థ్యాన్ని, సమస్యలను ఎదుర్కొనే ధైర్యాన్ని కూడా అందిస్తుంది.అయితే ఇప్పటికీ సమాజంలో కొందరు పిల్లలు వివిధ కారణాలతో పాఠశాలలకు దూరమవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ బాధ్యతలు, అవగాహన లోపం, బాల కార్మికత్వం వంటి సమస్యలు వారి విద్యకు అడ్డంకులుగా మారుతున్నాయి. ఒక




పిల్లవాడు చదువుకు దూరమవడం అంటే కేవలం ఒక వ్యక్తి భవిష్యత్తు కోల్పోవడం కాదు.. సమాజం ఒక విలువైన శక్తిని కోల్పోవడం. తల్లిదండ్రుల పాత్ర ఇక్కడ అత్యంత కీలకం. పిల్లలను పాఠశాలకు పంపించడం మాత్రమే కాదు, వారి చదువుపై నిరంతరం శ్రద్ధ చూపడం, ప్రోత్సహించడం, కలలను సాకారం చేసుకునేలా మార్గనిర్దేశం చేయడం కూడా అవసరం. చిన్న వయసులో పిల్లల చేతిలో పనిముట్లు కాకుండా పుస్తకాలు ఉండాలి. వారి అడుగులు కూలి పనుల వైపు కాకుండా పాఠశాల వైపు సాగాలి.ప్రభుత్వాలు విద్యా రంగంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, స్కాలర్‌షిప్‌లు వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. కానీ వాటి విజయానికి తల్లిదండ్రుల సహకారం, సమాజం బాధ్యతాయుతమైన వైఖరి అవసరం. ఒక చదువుకున్న తరం దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తుంది. ఒక పాఠశాలకు వెళ్లిన చిన్నారి రేపు శాస్త్రవేత్త కావచ్చు, ఉపాధ్యాయుడు కావచ్చు, వైద్యుడు కావచ్చు, దేశ నాయకుడు కావచ్చు. అందుకే ప్రతి చిన్నారి బడిబాట పట్టడం దేశ భవిష్యత్తుకు పెట్టుబడి.తల్లిదండ్రులు తమ పిల్లలను బడి వరకు నడిపించడం చిన్న పని అనిపించవచ్చు. కానీ ఆ చిన్న అడుగే వారి జీవితాన్ని విజయపథంలో నడిపించే మహత్తర ప్రయాణానికి శ్రీకారం. అందుకే ప్రతి ఇంటి నినాదం ఒక్కటే కావాలి "బడి బాటే భవిష్యత్తుకు బంగారు బాట."



**కొట్టే (లెనిన్), సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు. 99084 01581.**

# చిన్నారులను ఆశీర్వదించిన డాక్టర్ మట్టా దయానంద్

### రావమ్మకు నివాళి.. ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన





**తల్లాడ, /జూన్ 3 (జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో బుధవారం పలు కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. ముందుగా తాళ్ల గంగరాజు (మరణించిన)లూర్దు మేరీ దంపతుల కుమార్తె కీర్తన, ఆమె కుమారుడు కార్తీక్‌ల ఓనిపంచకట్టు వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. వారు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం అన్నారుగూడెం గ్రామ కాంగ్రెస్ నాయకుడు దుగ్గినేని గోపయ్య మాతృమూర్తి స్వర్గీయ రావమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరారు.
ఇక గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాలను డాక్టర్ మట్టా దయానంద్ సందర్శించారు. లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ, పేదల సొంతింటి కలలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రానున్న రోజుల్లో అన్నారుగూడెం గ్రామానికి మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నూతన గృహాలను సందర్శించిన సందర్భంగా లబ్ధిదారుల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ డాక్టర్ దయానంద్‌ను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమాల్లో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మీరెడ్డి, జక్కంపూడి కిషోర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపతి రెడ్డి, మాజీ వి.డి.సి చైర్మన్ మారెళ్ల మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, దీవెల కృష్ణయ్య, వెంకటగిరి సర్పంచ్ వెంకటేశ్వరరావు, గణేశుల రవి, తెలగారం సర్పంచ్ కాళోజి, రాయల రాము, తాళ్ల వెంకటి, పెద్ద తిరుమలయ్య, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వారాల అజయ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు

## కోదండరామాలయానికి రూ.50 వేల విరాళం

### దాతృత్వం చాటిన డాక్టర్ విజయపాల్ రెడ్డి



**ఎల్కతుర్తి, /జర్నలిస్ట్ వార్త:** సూరారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ కోదండరామాలయానికి హైదరాబాదుకు చెందిన డాక్టర్ సీహెచ్ విజయపాల్ రెడ్డి రూ.50 వేల విరాళం అందజేశారు. తంగెడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ పనులకు చేయూతగా ఆయన ఈ విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు.డాక్టర్ తంగెడ ప్రేమానందరావుకు క్లాస్‌మేట్ అయిన విజయపాల్ రెడ్డి, ఆలయ నిర్మాణం కోసం తన వంతు సహకారం అందించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.దాతల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, త్వరలోనే భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు.ఆధ్యాత్మిక సేవాభావంతో ముందుకు వచ్చి విరాళం అందించిన డాక్టర్ విజయపాల్ రెడ్డిని గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు అభినందించారు. గ్రామంలో నిర్మాణమవుతున్న కోదండరామాలయానికి ఆయన అందించిన సహాయం ఇతరులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

# పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం

### తెలంగాణకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక

### ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు

**హైదరాబాద్,,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)**



తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు.ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఏలుకుర్తిలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



**ధర్మసాగర్, /హనుమకొండ బ్యూరో జూన్ 3 (జర్నలిస్ట్ వార్త):**
ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "గో టు విలేజ్" కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ మండలంలోని ఏలుకుర్తి గ్రామంలో బుధవారం ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీతో పాటు మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) కన్వీనర్, కో-కన్వీనర్లను ఎన్నుకున్నారు.ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొలిపాక పవన్ మాదిగ, అధికార ప్రతినిధిగా కనుకం అనిల్ మాదిగ, ఉపాధ్యక్షులుగా కొలిపాక అనిల్ మాదిగ, కొలిపాక వికాస్ మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా కొలిపాక రజినీకాంత్ మాదిగ, కనుకం చంటి మాదిగ, ప్రచార కార్యదర్శిగా కొలిపాక కిరణ్ మాదిగ, కార్యదర్శిగా కొలిపాక సన్నీ మాదిగ, సహాయ కార్యదర్శిగా కొలిపాక హరీష్ మాదిగలను ఎన్నుకున్నారు.అదేవిధంగా ఎంఈఎఫ్ కన్వీనర్‌గా జోగు చిరంజీవి మాదిగ, కో-కన్వీనర్‌గా కొలిపాక రమేష్ మాదిగలను ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా కనుకం క్రాంతి మాదిగ, మేడి రాములు మాదిగ, సంద్ర శేఖర్ మాదిగ, కనుకం రవి మాదిగ, కొలిపాక రాజు మాదిగ, కొలిపాక యాదగిరి మాదిగ, చిలుక కిరణ్ మాదిగ, కొలిపాక రాజేష్ మాదిగ, కొలిపాక కొమురయ్య మాదిగ, కొలిపాక కరుణాకర్ మాదిగ తదితరులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను నాయకులు అభినందించి, గ్రామ స్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేసి మాదిగల హక్కుల సాధన కోసం కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వర్గీయ దుగ్గినేని రావమ్మకు ఘన నివాళులు



**తల్లాడ,/ జూన్ 3 (జర్నలిస్ట్ వార్త):**మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన స్వర్గీయ దుగ్గినేని రావమ్మ ఇటీవల పరమపదించిన నేపథ్యంలో బుధవారం వారి స్వగృహంలో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో జరిగింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై రావమ్మ పవిత్ర స్మృతులను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి రామనాథం రావమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి, గ్రామ సమాజానికి చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు, కూచిపూడి వెంకటేశ్వర్లు, కొమ్మినేని వెంకటేశ్వర్లు, రావూరి రవిప్రసాద్, కొమ్మినేని సత్యనారాయణ, నరసింహారావు, నారపోగు ప్రసాద్, బాబుగోడ్ల రవి తదితరులు పాల్గొన్నారు. బంధువులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వర్గీయ దుగ్గినేని రావమ్మకు ఘన నివాళులు అర్పించి ఆమె సేవలను కొనియాడారు.

## బయ్యారం జూనియర్ కాలేజీలో చేరే అమ్మాయిలకు ఉచిత హాస్టల్ సౌకర్యం.

**బయ్యారం/,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)**




బయ్యారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరే అమ్మాయిలకు ఉచిత హాస్టల్ సౌకర్యం కలిపిస్తున్నట్లు హాస్టల్ వార్డెన్ తెలిపారు.జూనియర్ కళాశాలలో అడ్మిషన్ కొరకు కళాశాల ప్రిన్సిపాల్ ని సంప్రదించాలన్నారు. మండలంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,బాలికల కోసం ప్రభుత్వం ఉచిత హాస్టల్ వసతిని కల్పిస్తుంది.పోస్ట్ మేట్రిక్ హాస్టల్ నందు అడ్మిషన్ పొందాలంటే ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.
**అడ్మిషన్ ప్రక్రియ వివరాలు:**అర్హత ప్రమాణాలు విద్యార్హత ఇంటర్మీడియట్,డిగ్రీ చదువుతున్న విద్యార్థినిలకు పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయి.ఆదాయ పరిమితి:కుటుంబ వార్షిక ఆదాయం ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి ఉండాలి.రిజర్వేషన్లు: ఎస్సీ,ఎస్టీ,బీసీ,విద్యార్థినిలకు నిర్దిష్టమైన సీట్లు కేటాయించబడతాయన్నారు. కావల్సిన పత్రాలు- కుల ధృవీకరణ పత్రం,ఆదాయ ధృవీకరణ పత్రం,పదో తరగతి మార్కుల మెమో,స్టడీ సర్టిఫికెట్,ఆధార్ కార్డు,రేషన్ కార్డు,రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న పోస్ట్ మాట్రిక్ హాస్టల్ ను సంప్రాదించాలన్నారు.

## కొత్తపేట మసీదులో అరబిక్ తాలీమ్.



**బయ్యారం/,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)**
కొత్తపేట మసీదులో అరబిక్ తాలీమ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇస్లామిక్ విద్యా తరగతులను, ఖురాన్ పఠనాన్ని,మతపరమైన బోధనలను బోధించారు.కొత్తపేట మజీద్ నందు నిర్వహించిన అరబి థాలిమ్ విశ్వాస కార్యక్రమంలో సెలవులలో పిల్లలకు మంచి విధానాలతో అరబీ తాలిమ్ మంచి విధంగా నేర్చుకున్నారన్నారు.ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా పిల్లలందరికి బహుమతులతో సత్కరించారు.

# మమతా బెనర్జీ కోటకు బీటలు !

,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)

కాంగ్రెస్‌లో ఉండగా ఫైర్‌బ్రాండ్ పేరు తెచ్చుకుని ప్రజలకు చేరువయ్యేలా ఎత్తులు, జిత్తుల వేసిన మమతా బెనర్జీ ఇప్పుడు దాదాపుగా ఒంటరిగా మారక తప్పడం లేదు. దాదాపు పదిహేనేళ్ల పశ్చిమబెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన దీదీ నిరంకుశ పాలనకు తెరతీశారు. బెంగాల్లో అధికారమే లక్ష్యంగా ఆమె చేసిన పనులు దేశ ఐక్యతను దెబ్బతీసే స్థితికి చేరాయి. లక్షల్లో బంగ్లా దేశీయుల చొరబాట్లను ప్రోత్సహించి, ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చినా.. పాపం పండింది. ఇప్పుడు ఎక్కడ చూసినా బంగ్లా జీతాయులు బెంగాల్‌ను వీడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సువేందు అధికారి పగ్గాలు చేపట్టగానే తొలుత బంగ్లాదేశాయులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల్లో వారు వేలాదిగా గుమికూడి భారత్‌ను వీడే దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా నిరంకుశంగా వ్యవహరించారు. ఓ స్త్రీ అధికారంలో ఉంటే ఎంతగానో అభివృద్ధి చెందాలసిన బెంగాల్ అరాచక పాలనకు కేంద్రబిందువుగా మారింది. అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు రాజ్యమేలాయి. ఇవన్నీ ఇప్పుడు శాపంగా మారి మమతను వెంటాడుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాకముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమత మవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా




కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభంగా దీనిని చెప్పవచ్చు. బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరఫున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరఫున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. చీలిక వర్గానికి మెజార్టీ ఉందని అతను ప్రకటించడం మమతా బెనర్జీకి మింగుడుపడని వ్యహారంగా చూడాలి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుం టున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపన్ రాయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో భాజపా గెలుపు అనంతరం తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత, మాజీ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారు. భాజపాకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడుతానని ఆమె శపథం చేశారు. దేశవ్యాప్తంగా భాజపాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు దిల్లీలో సమావేశమవుతాయి. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన కొనసాగుతుందని మమత స్పష్టంచేశారు. అయితే అధజకారంలో ఉండగా అత్తా అల్లుళ్ల ఆగడాలను నేతలతో పాటు ప్రజలు కూడా సమించారు. కానీ పరిస్తితి మారింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో వీరంతా తిరుగుబాటు జెండా ఎగరువేశారు. ఏ జెండాకు ఆగొడుగు పట్టి, నానా యాగీ చేయడం మమతా బెనర్జీ నైజం. మొన్నటి ఎన్నికల్లో అలాగే చేయబోయారు. కానీ బిజెపి పన్నిన ఉచ్చులో పడ్డ మమత గిలగిల కొట్టుకోవడం మినహా చేయగ లింది లేదు. మమతను ప్రజలే ఛీత్కరించుకునే స్థాయికి వచ్చింది.

# రాజధానిపై జగన్ నిత్య అసంతృప్తి

**ఓసారి మూడు రాజధానుల ప్రకటన**

**ఇప్పుడేమో మావిగాన్ అంటూ కొత్త గానం**

**జగన్ వ్యాఖ్యలు పిల్లలకు కూడా విసుగెత్తేలా ఉన్నాయి**

**రాజధాని నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ**

అమరావతి,,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. మావిగాన్ వ్యాఖ్యలపై మంత్రి నారాయణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్ మావిగాన్ వ్యాఖ్యల పట్ల చిన్న పిల్లలు కూడా నవ్వుకుంటున్నారన్నారు. ఒకారి మూడు రాజధానులు, ఇప్పుడేమో మావిగాన్ అంటూ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు దుర్మార్గం అన్నారు. జగన్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. రాజధాని ప్రాంతంలో మంత్రి నారాయణ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహ మార్గాలను, పెనుమాక రిజర్వాయర్‌ను పరిశీలించారు. రాజధాని రోడ్డుల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాలలో వాగుల ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నిర్మాణం జరుగుతున్న వంతెనల క్రింది భాగంలో మట్టి పూడిక తీతలు త్వరగా



తొలగించాలని ఆదేశించారు. తెలంగాణకు వచ్చే ఆదాయం హైదరాబాద్ నుంచి వస్తుందని.. అమరావతి ఆదాయం అన్ని జిల్లాలకు పంచుతారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి అంటే విజన్ ఉండాలని.. జగన్‌కు లేదంటూ వ్యాఖ్యానించారు. రైతులను ల్యాండ్ పూలింగ్‌కు రావాలని మరోసారి కోరుతున్నట్లు తెలిపారు. రైతుల దగ్గర బలవంతంగా తీసుకోకూడదనే ఇప్పటి వరకు ల్యాండ్ అక్విజేషన్‌కు వెళ్లలేదన్నారు. 2028 ఆగస్టు నాటికి రాజధాని దాదాపు సిద్ధం అవుతుందని స్పష్టం చేశారు. నేటికి నయా రాయపూర్ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. జగన్ డేటా తీసుకుని మాట్లాడాలని హితవుపలికారు. అమరావతిలో పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. వర్షాకాలం వచ్చేలోగా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. గత వర్షాకాలం పశ్చిమ బైపాస్ కింద వాగులు పూడిపోవడంతో వాటర్ వెనక్కి తన్నిందని.. వెస్టర్న్ బైపాస్ దగ్గర 2 బ్రిడ్జి పనులు జరుగుతుండగా మరో 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతాయన్నారు. వెస్టర్న్ బైపాస్ వద్ద వెంట్స్‌ను పదిరోజుల్లో క్లియర్ చేస్తామని చెప్పారు. అమరావతి వాటర్ ఎ÷-లో కోసం నెదర్లాండ్స్ వాళ్లతో మాట్లాడి డిజైన్ చేశామన్నారు. పనులు జరుగుతున్నప్పుడు కొన్ని ఇబ్బందులు ఉంటాయని వెల్లడించారు. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు మాత్రమే ఇబ్బందులు ఉంటాయని.. తరువాత 69 బ్రిడ్జిలు పూర్తి అవుతాయని తెలిపారు. 200 సంవత్సరాల చరిత్ర తీసుకొని గ్రావిటీ కెనాల్‌లను ఏర్పాటు చేసినట్లు నారాయణ తెలిపారు. గత సంవత్సరం వెస్టర్న్ బైపాస్‌ను కడుతూ ప్రవాహం పూడ్చేశారని.. దీంతో అక్కడ పూడిక ఏర్పడిందన్నారు. ఈసారి అలాంటి సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. 494 ఎకరాలకు మాత్రమే ఇంకా ఎ÷-లాట్‌లు కేటాయించలేదని.. అక్కడ న్యాయపరమైన చిక్కులు, వారసత్వ ఇబ్బందులు ఉన్నాయన్నారు. లాటరీకి సిద్ధంగా 144 ఎకరాలు 74 మంది రైతులు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 35,057 ఎకరాలు తీసుకున్నామని.. ఇందులో రిటర్నబుల్ ఎ÷-లాట్‌లు ఇవాల్సింది 498 ఎకరాలు మాత్రమే అని మంత్రి నారాయణ వెల్లడించారు.

# మేలో భారీగా తిరుమల లడ్డూ విక్రయాలు

## మొత్తం 1.21 కోట్ల లడ్డూలను విక్రయించినట్లు వెల్లడి

తిరుమల,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)


ఈ ఏడాది మే నెలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. భారీగా భక్తులు తరలి ర ఆవడంతో ఆదాయంతో పాటు, లడ్డూ విక్రయాలు కూడా పెరిగాయి. మొత్తం 1.21 కోట్ల లడ్డూలను విక్రయించినట్లు తితిదే వెల్లడించింది. 2024 మే నెలలో 1.01 కోట్లు, 2025 మే నెలలో 1.10 కోట్ల లడ్డూలను విక్రయించగా.. ఈసారి సంఖ్య మరింత పెరిగింది. రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలను తయారు చేసింది. లడ్డూల తయారీకి తితిదే రోజువారీగా 68 టన్నుల ముడి పదార్థాలను వినియోగిస్తోంది. ఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత, సంప్రదాయం, భక్తి భావనల సమ్మేళనంగా నిలిచే శ్రీవారి లడ్డూ ప్రసాదం తిరుమల మహత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెబుతోంది.

# ప్రిన్స్‌టన్ విద్యా సంస్థలకు సుప్రీం మొట్టికాయలు

## అమెరికా యూనివర్సిటీ పేరు వాడడంపై ఆంక్షలు

## తక్షణం సంబంధం లేదంటూ ప్రకటన విడుదలకు ఆదేశం

న్యూఢిల్లీ,,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త):అమెరికాలో ఉన్న ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ పేరు వాడుతుండటంపై తెలంగాణలోని ప్రిన్స్‌టన్ విద్యాసంస్థలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ యూనివర్సిటీకి తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ బోర్డులు పెట్టాలని తెలంగాణ కాలేజీని ఆదేశించింది. జూన్ 12లోగా ప్రముఖ దినపత్రికల్లో కనీసం పావు పేజీ ప్రకటనలు ఇవ్వాలని కాలేజీ




యాజమాన్యాన్ని ఆదేశించింది .అమెరికా యూనివర్సిటీ విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో వాగ్దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ 'ప్రిన్స్‌టన్' పేరుతో కాలేజీలను నడుపుతోంది. తమ ట్రేడ్‌మార్క్‌ను వినియోగిస్తున్న వాగ్దేవి సంస్థలపై అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక 'ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ' కేసు పెట్టింది. దీనికి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. కాలేజీ వెబ్‌సైట్లలో అందరికంటే పెద్ద అక్షరాలతో 'డిస్‌క్లెయిమర్ నోటీసు' స్పష్టంగా ప్రదర్శించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కళాశాలకు సంబంధించిన అన్ని రకాల సర్టిఫికెట్లు, ఇతర అన్ని పత్రాలు, ఫారాలపై తప్పనిసరిగా డిస్‌క్లెయిమర్ ముద్రించాలని స్పష్టం చేసింది. నూతన విద్యా సంవత్సరం అడ్మిషన్ల పక్రియ ప్రారంభమయ్యేలోపే నిబంధనలను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతర్జాతీయ బ్రాండ్ల పేరుతో విద్యార్థులు అయోమయానికి గురి కాకుండా ఉండేందుకే ఈ చర్యలు తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# ఎన్టీఆర్ రాకతోనే బడుగులకు రాజకీయ న్యాయం

**ఇవాళ ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటే ఊరుకుంటామా?**

**రాజకీయ నేతల వ్యాఖ్యలపై మండిపడ్డ తెలంగాణ టిడిపి నేతలు**

హైదరాబాద్,,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)

ఎన్టీఆర్ పార్టీ ప ఎట్టి రాజకీయాల్లోకి వచ్చాక బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు వచ్చిందని టీడీపీ తెలంగాణ నేతలు అన్నారు. ఈ మేరకు పొలిట్‌బ్యూరో మెంబర్ అర్వింద్ కుమార్ గౌడ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ గురించి తెలియక కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ సమాధి తొలగిస్తామని.. ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటున్నారని అన్నారు. తెలంగాణ వాళ్లు కాదని.. అంబేద్కర్, పూలే విగ్రహాలు తీసేస్తారా అని ప్రశ్నించారు. కొత్తగా పుట్టిన పార్టీ వాళ్లు ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం చంద్రబాబు నాయుడు ఆనాడు లేఖ ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ తెచ్చిన సంస్కరణల వల్లే తెలంగాణ ఇప్పుడు నంబర్ వన్‌గా ఉందని అర్వింద్ అన్నారు. కొత్తగా పెట్టిన పార్టీ వాళు



,,.. తాము ముఖ్యమంత్రి అవుతామని విగ్రహాలు తొలగిస్తామని అంటున్నారని వ్యాఖ్యానించారు. ఎవరైనా ఎక్కడైనా మీటింగ్‌లు పెట్టుకోవచ్చని.. పోటీ చేయవచ్చన్నారు. కానీ ఇక్కడ మీటింగ్‌లు పెట్టుకోవద్దని... పెడితే అడ్డుకుంటామని అనడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. రాష్ట్రాలు వేరైనా తెలుగు వాళ్లంతా ఒక్కటిగా ఉందామని అర్వింద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ తమ వల్లనే వచ్చిందన్న కేసీఆర్ పదేళ్లు పాలన చేశారని టీడీపీ నేత నన్నూరి నర్సారెడ్డి అన్నారు. తెలంగాణ ఇచ్చింది తామే అన్న పార్టీ రెండున్నరేళ్ళుగా అధికారంలో ఉందన్నారు. ఈ రెండు పార్టీల పాలనపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. 60-70 ఏళ్లు జరగని దోపిడీ కేసీఆర్ పాలనలో జరిగిందని ఆరోపించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో అంతకుమించి దోపిడీ జరిగిందని వ్యాఖ్యానించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏం తప్పుగా మాట్లాడారని ఆయనపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధి కోసం జనసేనతో కలిసి పోటీ చేస్తామని.. మరో పార్టీతో అయినా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డ అభివృద్ధికి బాటలు వేసింది టీడీపీ అని నర్సారెడ్డి అన్నారు. చంద్రబాబును, టీడీపీని అప్రతిష్ఠపాలు చేసే కుట్రలు ఇక్కడ నుంచి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు, సేవా కార్యక్రమాలు తెలంగాణ ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు. ప్రశ్నించే తత్వాన్ని ప్రజలకు నేర్పుతున్న పార్టీని ఎందుకు అడ్డుకుంటున్నారన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన పార్టీలకు ఇక్కడ మనుగడ ఉందని తెలిపారు. అడ్డుకుంటాం.. దాడులు చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. పొత్తుల అంశం ఎన్నికల సమయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని నన్నూరి నర్సారెడ్డి పేర్కొన్నారు.

# మద్యం ఆదాయంపై ప్రత్యేక దృష్టి

## అందుబాటులోకి కొత్తగా 150, 200 ఎంఎల్ బాటిళ్లు

హైదరాబాద్,,జూన్ 3.(జర్నలిస్ట్ వార్త)

:తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం విక్రయాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మద్యం సీసాల పరిమాణాలకు అదనంగా కొత్త సైజులను ప్రవేశపెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ పాత నిబంధనలను సవరిస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్లో 90ఎంఎల్, 180ఎంఎల్, 375ఎంల్, 750ఎంఎల్




పరిమాణాల్లో మద్యం బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటితో పాటు కొత్తగా 150, 200 ఎంఎల్ పరిమాణాల్లో మద్యం సీసాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అయితే, కొత్త సీసాల పరిమాణాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మద్యం మార్కెట్లో కొత్త మార్పులకు దారితీయనుంది.